# పేదల ఆరోగ్య సంరక్షణే సీఎం జగన్ లక్ష్యం

**పరవాడ:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఆర్థిక స్థోమత లేని నిరుపేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ఓ వరం లాంటిదన్నారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని మరింత బలోపేతం చేసేందుకు సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్న ఆలోచనతోనే ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. ప్రతీ ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. శిబిరంలో డాక్టర్ వెంకన్నబాబు, డాక్టర్ రాజేష్, డాక్టర్ హరిక, డాక్టర్ కనకఅప్పారావు 294 మందికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, సర్పంచ్ శివలంక లక్ష్మి, ఉప సర్పంచ్ కె.శ్రీను, పంచాయతీ కార్యదర్శి మురళీధర్ పట్నాయక్, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి

**సబ్బవరం:** ప్రజా ఆరోగ్య రక్షణకు జగనన్న ఆరోగ్య సురక్ష రక్షగా నిలుస్తుందని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. మండలంలోని తవ్వవానిపాలెం సచివాలయం వద్ద మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో 638 మందికి పరీక్షలు చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ వైద్య శిబిరానికి రాలేక మంచానికే పరిమితమైన వారి ఇళ్లకు వైద్య సిబ్బంది వెళ్లి పరీక్షలు చేశారు. సర్పంచ్ బోకం స్వామినాయుడు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కోటాన రాము, ఎంపీడీవో రమేష్ నాయుడు, తహసీల్దార్ బి.సత్యనారాయణ, బోకం కాసుబాబు, ఐడీ బాబు, ఈవోపీఆర్డీ మహేష్ పాల్గొన్నారు.

## రాష్ట్రంలో వైద్య రంగానికి పెద్దపీట

**సింహాచలం :** రాష్ట్రంలో వైద్య రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పెద్దపీట వేశారని పెందుర్తి ఎంపీపీ మధుపాడ నాగమణి తెలిపారు. పెందుర్తి మండలం ఎస్ఆర్‌పురంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన నాగమణి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అందుకే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. స్పెషలిస్టు వైద్యులతో పరీక్షలు


వాడచీపురుపల్లిలో పోషకాహార స్టాల్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, తదితరులు

చేయించడంతోపాటు అవసరమైన వారికి మందులు ఉచితంగా అందిస్తున్నారని కొనియాడారు. కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లద్దాలు అందిస్తున్నామన్నారు. పెందుర్తి మండలంలో ఇప్పటికి ఎనిమిది క్యాంపులు నిర్వహించామన్నారు. గ్రామీణుల చెంతకే నిపుణులైన వైద్యులు వచ్చి మెరుగైన వైద్యం అందిస్తుండడంతో సీఎం జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నారన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లుగా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కొనియాడారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా జగన్ మోహన్‌రెడ్డిపై ప్రజలకు ఉన్న అభిమానాన్ని దూరం చేయలేరన్నారు. ఈ సందర్భంగా 411 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అలాగే 32 మందిని మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పిలి దేవి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నక్క కనకరాజు, ఎస్ఆర్‌పురం సర్పంచ్ విజయలక్ష్మి, నాయకులు మధుపాడ అంజి, పళ్ల పద్మనాభం, అక్కిరెడ్డి మహలక్ష్మినాయుడు, అక్కిరెడ్డి కనకరాజు, డిప్యూటీ తహసీల్దార్ రంగాకుమారి, ఈవోపీఆర్డీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


తవ్వవానిపాలెంలో రోగి ఇంటికి వెళ్లి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీపీ నాగమణి


ఎస్ఆర్‌పురంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఎంపీపీ నాగమణి, అధికారులు, ప్రజాప్రతినిధులు

## క్లుప్తంగా

### సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విశేష అభిషేకాలు


సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

**సింహాచలం:** అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ, భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు.

### కెరీర్ గైడెన్స్‌పై అవగాహన


కెరీర్ గైడెన్స్, ప్రైమరీ సాఫ్ట్‌వేర్‌పై అవగాహన కల్పిస్తున్న పలుకూరి కార్తీక్

**సింహాచలం:** పెందుర్తి మండలం పినగాడిలో ఉన్న వెల్ఫేర్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, ప్రైమరీ సాఫ్ట్‌వేర్ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రైమరీ సాఫ్ట్‌వేర్ వల్ల కలిగే ఉపయోగాలు, వినియోగించే విధానాన్ని విభాగాధిపతి పలుకూరి కార్తీక్ వివరించారు. అలాగే జామ్(జస్ట్ ఏ మినిట్), జీడీ(గ్రూప్ డిస్కషన్) వల్ల కలిగే ఉపయోగాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జాషువా, విభాగాధిపతి డాక్టర్ బి.వి.శివకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

### ఢిల్లీకి మట్టి పంపించేందుకు సన్నాహాలు


కలశంతో మట్టిని తీసుకెళ్తున్న బీజేపీ పెందుర్తి కన్వీనర్ గొర్లె రామునాయుడు, తదితరులు

**సింహాచలం:** మన మట్టి-మన దేశం కార్యక్రమంలో భాగంగా సేకరించిన మట్టిని ఢిల్లీకి పంపించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు బీజేపీ పెందుర్తి నియోజకర్గం అసెంబ్లీ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు మంగళవారం తెలిపారు. సెప్టెంబర్ ఒకటి నుంచి 15వ తేదీ వరకు పెందుర్తి నియోజకర్గంలోని ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి మట్టిని సేకరించామన్నారు. ఆ మట్టిని అక్టోబరు ఒకటి నుంచి 13వ తేదీ వరకు మండలాల్లో ఊరేగిస్తున్నట్టు చెప్పారు. మండలాల వారీగా సభ్యులు మట్టిని ఢిల్లీకి తీసుకెళ్తారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, తదితరులు

**సింహాచలం:** జీవీఎంసీ 97వ వార్డులో పలు అభివృద్ధి పనులకు పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. శ్రమశక్తినగర్ ఘంటశాల కళామందిర్ వద్ద రూ.19.65 లక్షలతో పార్కు కాంపౌండ్ వాల్ నిర్మాణం, గేటు ఏర్పాటుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అలాగే ఎస్‌సీబీసీ కాలనీలో రూ.5.35లక్షలతో ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, 97వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్, ఆయా కాలనీల ప్రతినిధులు సాంబశివరావు, దయానంద్, సందీప్, నక్క శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అప్పన్నకు ఘనంగా ఏకాదశి ఆర్జిత సేవలు


జీలకర్రబెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

**సింహాచలం:** ఏకాదశి సందర్భంగా శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ తులసీ దళార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేయింపజేశారు. ఉభయదాతలను స్వర్ణ తులసీదళాలతో ప్రదక్షిణ చేయించారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహిస్తూ 108 స్వర్ణతులసీ దళాలతో అర్చన చేశారు. ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

**విశేషంగా నిత్య కల్యాణం**

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటలకు ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

## సింహగిరిపై వైద్య శిబిరం నిర్వహణకు వినతి

**సింహాచలం:** శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తిని మంగళవారం అడవివరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ ఎన్.రామిరెడ్డి మర్యాద పూరకంగా కలిశారు. ఆయనకు మొక్కను బహూకరించారు. సింహగిరిపై ప్రతి శనివారం భక్తుల సౌకర్యార్థం గతంలో మాదిరిగా ఆరోగ్య కేంద్రం తరఫున వైద్య శిబిరం నిర్వహించాలన్నారు. ఈ మేరకు వినతిపత్రం అందజేయగా.. ఈవో సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్లు పార్వతీశం, నరసింగరావు పాల్గొన్నారు.

## వ్యసనాలకు దూరంగా ఉంటే సంపూర్ణ ఆరోగ్యం

**గోపాలపట్నం :** నరవలోని బెహరా నర్సింగ్ కళాశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందుమతి మాట్లాడుతూ సానుకూల దృక్పథంతో వ్యసనాలకు అలవాటు పడకుండా ఉంటే ఆరోగ్యంగా ఉంటామన్నారు. అక్టోబర్ 10న ప్రపంచ వ్యాప్తంగా మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించుకోవడం ఆనవాయితీ అన్నారు. మానసిక ఆరోగ్యం సార్వత్రిక మానవ హక్కు అనే నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ఈ మేరకు నరవ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సెల్‌ఫోన్లు, ఆన్‌లైన్ గేములకు అలవాటు కాకూడదన్నారు. టెక్నాలజీని అవసరం మేరకే వాడుకోవాలని సూచించారు. యోగా, మెడిటేషన్, వ్యాయామం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అనూష ప్రియ, దివ్యశ్రీ, అధ్యాపకులు నీరజ, దీపక్, షర్మిళ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


ఎయిడ్స్ సింబల్ మాదిరిగా విద్యార్థుల ప్రదర్శన

## సింహగిరిపై విశేషంగా ఏకాదశి తిరువీధి

**సింహాచలం:** ఏకాదశి సందర్భంగా సింహగిరిపై మంగళవారం సాయంత్రం మదనగోపాలస్వామికి తిరువీధి నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించి పల్లకిలో వేయింపజేశారు. సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. దివ్యప్రబంధాలను అధ్యాపకులు పఠించారు. విశేషంగా హారతులు అందజేశారు. భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు టి.పి.రాజీవ్‌లోచన్, తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.


మదనగోపాలస్వామికి తిరువీధి నిర్వహిస్తున్న వైదికులు

## రూ. 9.75 కోట్లతో సబ్బవరం–గుల్లేపల్లి రోడ్డు విస్తరణ

**శంకుస్థాపన చేసిన మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే అదీప్‌రాజ్**

**సబ్బవరం:** సబ్బవరం–గుల్లేపల్లి రోడ్డు విస్తరణతో ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక సాకారం కానుందని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. రూ.5.71 కోట్ల నిధులతో విస్తరించనున్న సబ్బవరం – గుల్లేపల్లి రోడ్డుకు మండలంలోని సబ్బవరం పాతరోడ్డు వద్ద ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌తో కలిసి మంగళవారం ఆయన శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల అభీష్టం, అవసరాల మేరకు ఈ ప్రాంతంలో రోడ్ల విస్తరణ, పునర్నిర్మాణం చేపడుతున్నామన్నారు. సబ్బవరం – గుల్లేపల్లి రోడ్డును 60 అడుగుల వెడల్పుతో రెండు వరసల రహదారిగా విస్తరించి త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 2018లో పాదయాత్ర సమయంలో గుల్లేపల్లి నుంచి సబ్బవరం సమావేశానికి వస్తున్నప్పుడు ఇరుకుగా ఉన్న ఈ రోడ్డును విస్తరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీ నెరవేర్చేందుకు ప్రస్తుతం రోడ్డు విస్తరిస్తున్నామని తెలిపారు. రోడ్డు విస్తరణతో పాటు కల్వర్టుల నిర్మాణం కోసం రూ.9.75 కోట్లు మంజూరు చేశామన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడంతోపాటు మంచి జరిగితేనే వచ్చే ఎన్నికల్లో ఓటు వేయండనే ముఖ్యమంత్రిని, నాయకుడిని దేశంలో ఇప్పటి వరకూ ఎవరూ చూడలేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 98 శాతానికి పైగా అమలు చేసిన విశ్వాసంతో ఆ మాట ధైర్యంగా చెప్పగలుగుతున్నారన్నారు. నాలుగున్నరేళ్లలో సీఎం జగన్ చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ఎమ్మెల్యేలు, మంత్రులు రాష్ట్ర వ్యాప్తంగా చెప్పుకునే పరిస్థితి ఉండడంతోనే వచ్చే ఎన్నికల్లో విజయం సాధిస్తామనే ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కోటాన రాము, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, నాయకులు బోకం రామునాయుడు, సాలాపు వెంకటేశ్వరరావు, సబ్బవరపు నారాయణమూర్తి, మోపాడ అప్పారావు, ఎంపీడీవో రమేష్ నాయుడు, తహసీల్దార్ బి.సత్యనారాయణ, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, ఎంపీటీసీ సభ్యుడు బైలపూడి దేముడుబాబు, యడ్ల నాయుడు, దెడ్డెం పద్మావతి, పల్ల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే అదీప్‌రాజ్, తదితరులు

## విలువిద్య పోటీలకు ఎంపికలు


బాలికల విభాగంలో ఎంపికైన క్రీడాకారులు


బాలుర విభాగంలో ఎంపికైన క్రీడాకారులు

**పరవాడ:** ఈ నెల 20 నుంచి 24 వరకు కడపలో జరగనున్న సీనియర్, జూనియర్ రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలకు క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో మంగళవారం జరిగింది. జిల్లా జట్టులో 33 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. జిల్లా ఆర్చరీ అసోసియేషన్ చైర్మన్ పి.సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ విలువిద్య క్రీడ శారీరక, మానసిక సమన్వయానికి ప్రతీక అన్నారు. ఇటువంటి క్రీడలు విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం నింపుతాయన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాల నుంచి 80 మంది క్రీడాకారులు ఈ ఎంపిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులకు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, సీఈవో కె.నిశాంత్, స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్చరీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.సత్యనారాయణ, కార్యదర్శి పి.భాస్కర్, కోచ్ సుధాకర్, ఎల్.సూరిబాబు, పాఠశాల కోచ్‌లు గోవింద, హరిరాజ్ సింగ్, బషీర్, రాజేష్ పాల్గొన్నారు.

## ఘనంగా ముల్లారమ్మ, దుర్గమాంబ విగ్రహాల ప్రతిష్ట


ముల్లారమ్మ, దుర్గమాంబను దర్శించుకుంటున్న మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

**పరవాడ:** ముత్యాలమ్మపాలెంలో ముల్లారమ్మ, దుర్గమాంబ అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు కన్వీనర్ బొంది అచ్చిబాబు, బొంది మసేను, పార్టీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## అడవివరం పాఠశాల సందర్శన

**సింహాచలం:** అడవివరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం సాయంత్రం డీఈవో చంద్రకళ సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. నాణ్యతతో పనులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని పరిశీలించారు. వర్క్ బుక్స్ కరెక్షన్ ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులు చేస్తున్నారా..? లేదా..? అన్న అంశంపై పరిశీలన చేశారు. జగనన్న గోరుముద్దకు సంబంధించి కొత్తగా అందజేసిన వంట పాత్రలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల పనితీరుని మెచ్చుకున్నారు. ప్రధానోపాధ్యాయిని బి.రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.


అడవివరం పాఠశాలలో వంటపాత్రలను పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

## ట్రస్ట్ బోర్డు సమావేశం నిర్వహించాలి

**సింహాచలం:** శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సమావేశం నిర్వహించాలని ట్రస్ట్ బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్ దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తిని కోరారు. ఈ మేరకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ట్రస్ట్‌బోర్డు సమావేశానికి సంబంధించిన యాక్ట్‌ని వెంటనే అమలులోకి తీసుకురావాలని ఈవోను ఆయన కోరారు. మార్చి ఒకటిన ట్రస్ట్‌బోర్డు సమావేశం జరిగిందని, అప్పటి నుంచి ఇప్పటి వరకు మళ్లీ సమావేశం నిర్వహించలేదని వివరించారు. ఈ విషయంపై ఈవో స్పందిస్తూ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ అశోక్‌గజపతిరాజుకి లిఖిత పూర్వకంగా లేఖ రాశారు.

## మానసిక ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ

**సబ్బవరం:** ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రమేష్ కిశోర్ సూచనల మేరకు నిర్వహించిన ఈ ర్యాలీని పాఠశాల ప్రిన్సిపాల్ కె.విజయ కుమార్ ప్రారంభించారు. సీఐ రంగనాథం, వైస్ ప్రిన్సిపాల్ జె.అప్పారావు, జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమ సిబ్బంది జి.సాయిలక్ష్మి, ఎ.మధులత, పాఠశాల వైద్యాధికారి కె.కన్నంనాయుడు పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

**పరవాడ:** పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలో నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెంలో మంగళవారం ఏపీకి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర చేపట్టారు. వెంకటపతిపాలెం నుంచి రెండు కిలోమీటర్ల సాగిన ఈ పాదయాత్రలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు అడుగడుగునా మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. అనంతరం నాయుడుపాలెం సినిమాహాలు కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి మేలు జరిగిందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా నాయుడుపాలెం ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజలకు సంక్షేమ ఫలాలు పూర్తి స్థాయిలో అందించాలన్న సంకల్పంతో గ్రామ, వార్డు సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ప్రవేశపెట్టారన్నారు. ఏటా పింఛన్లను పెంచుకొంటూ పోవడమే తప్పా ఎక్కడ తగ్గించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, పార్టీ పెందుర్తి నియోజకవర్గం ఇన్‌చార్జ్ అన్నంరెడ్డి అజేయ్‌రాజ్, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, ఉప సర్పంచ్ రాజాన ముత్యాలు, వైఎస్సార్ సీపీ నాయకులు పైల ముత్యాల నాయుడు, దాదానాయుడు, కూండ్రపు అప్పలనాయుడు, బండారు కృష్ణబాబు, బి.శ్రావణ్‌కుమార్, డి.రాజేష్, నరేష్, రమాదేవి, సోమునాయుడు, యమహనాయుడు, రత్నకుమారి, బండారు శ్రీను, దొడ్డి ముత్యాలు పాల్గొన్నారు.


పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు